# సింగిల్ పేజీ కథలు

## పసి మనసు

"మా అమ్మ కదూ... మా తల్లి కదూ. ఈ ముద్ద నాదంట. ఈ ఒక్కటి తిన్నావంటే ఇంతకంటే అందంగా ఉంటావమ్మా. నా బంగారం కదూ!"

దివ్యను సముదాయిస్తూ అన్నం తినిపిస్తోంది వసంత.

తల్లి సముదాయింపుతో మరింత గారాలుపోతోంది దివ్య. దివ్య చిన్నపిల్లేం కాదు. ఆరు దాటి ఏడో సంవత్సరంలోకి రాబోతోంది. అయినా ఇంకా వీడని పసితనం. ఒక్కతే కూతురవ్వడం వలన ముద్దులు, ముచ్చట్లు ఎక్కువే. మంకుతనం, అల్లరి స్వభావం లేవుగానీ అన్నం తినిపించాలన్నా, బడికి తయారుచేసి పంపాలన్నా ప్రతీరోజు ఈ పర్వం తప్పదు.

మరొక ముద్ద కలిపి "ఇది డాడీ ముద్ద. ఇది కూడా తిన్నావంటే మీ డాడీలాగా ఎత్తు పెరుగుతావంట. నా బంగారం బుగ్గలు చూడు సరిగ్గా తినక ఎల్లా లోతుకు పోయాయో!" ఎలాగో తంటాలు పడి మరో ముద్ద తినిపించేసింది.

అప్పుడే ఆఫీసు నుండి రవీంద్ర వచ్చాడు. బైక్ స్టాండ్ వేసి లోనికొస్తూనే "ఎందుకు వసంతా... అంత బలవంతంగా పెడతావ్. వేళగాని వేళ తింటే రాత్రికి గడబిడ చేస్తుందేమో. జ్వరం నుండి తేరుకుని రెండు రోజులేగా అయింది" అన్నాడు.

"ఈ రోజు లంచ్ బాక్స్ అలాగే తీసుకొచ్చేసిందండీ. ఒక్క మెతుకైనా ముట్టలేదు. ఈ వయసులో కాకపోతే మరెప్పుడు తినాలి" అని, "ఆదివారం నీ బర్త్‌డే కదా. నీకు డాడీ మంచి ఫ్రాక్ తెస్తారు. బోలెడు స్వీట్లు తెస్తారు. నీ ఫ్రెండ్సందరినీ పిలిచి బోలెడు చాక్‌లెట్స్ పంచిపెడదాం. సరేనా. మరి ఈ కొద్దిగా కూడా తినేసేయ్!" అంది వసంత.

తల్లి మాటలతో దివ్య కళ్లు మెరిశాయి. "నా ఫ్రెండ్సందరినీ పిలుస్తావా మమ్మీ!" ఉత్సాహంలో ఉన్న దివ్యకు మరో ముద్ద... అలా అలా అంతా తినిపించేసింది వసంత.

గదిలోకెళ్లి డ్రెస్ ఛేంజ్ చేసుకొచ్చిన రవీంద్ర "రేపు మా అమ్మ వస్తుందట. మధ్యాహ్నం ఆఫీసుకు మా తమ్ముడు ఫోన్ చేసి చెప్పాడు. నాలుగున్నరకు అలారం పెడితే స్టేషన్‌కెళ్లి అమ్మను తీసుకొస్తాను" అన్నాడు.

ఆ మాటలు వినగానే చేతిలోని వెండి గిన్నెను పెద్ద చప్పుడుతో కింద పెట్టి చివ్వున ఇటు తిరిగింది వసంత. "మీ అమ్మగారు వెళ్లి పట్టుమని పది రోజులైనా కాలేదు. అప్పుడే మీ తమ్ముడికి, మీ మరదలుగారికి ఈవిడగారి ముఖం మొత్తిందా. గోడకు కొట్టిన బంతల్లే అప్పుడే పంపించేస్తున్నారు!" అంది వ్యంగ్యంగా.

"ఛ...అవేం మాటలు వసంతా. ఈ వయసులో అమ్మకి ఎక్కడుండాలనిపిస్తే అక్కడుంటుంది. చెల్లెలి పెళ్లి విషయంలో మా తమ్ముడే గదా అంతా ఆదుకుంది. పెద్దకొడుకుగా అమ్మను చూసే బాధ్యత నాకు లేదా!" సర్ది చెప్పాడు రవీంద్ర.

"ఆయనగారికేం తక్కువ. బ్యాంక్ మేనేజరాయె. సుభద్ర కూడా ఉద్యోగం వెలగబెడుతోందిగా. నెల తిరిగే సరికి జీతాల కోసం పడిగాపులు పడే బతుకులు మనవి. నేను పీజీ చేసినా దివ్య కోసమేగా ఇంట్లో ఉంటోంది. ఏమైనా ఈ అదనపు బాధ్యతలు నేను మోయలేను బాబూ. ఆవిడగారికి సమయానికి అన్నీ అమర్చడం నా వల్ల కాదంటే కాదు!" నిష్కర్షగా చెప్పేసి వంటింట్లోకెళ్లిపోయింది వసంత.

మారు మాట్లాడలేదు రవీంద్ర. మనసులోనే నొచ్చుకున్నాడు. దివ్య మెల్లగా తండ్రి దగ్గరకొచ్చి "డాడీ... నా పుట్టిన రోజుకు నానమ్మొస్తుందా!" అని అడిగింది.

"ఔనమ్మా!" అంటూ కూతురి బుగ్గమీద ముద్దు పెట్టాడు రవీంద్ర.

ooo

ఆ రోజు ఆదివారం. దివ్య పుట్టిన రోజు.

ఇరుగుపొరుగు పిల్లలతో ఇల్లంతా సందడిగా ఉంది. కేరింతలతో మార్మోగిపోతోంది. అంతవరకు పిల్లలతో గడిపిన శకుంతలమ్మ గదిలోకెళ్లి నీరసంగా నడుం వాల్చింది.

ఈ నాలుగు రోజులుగా గమనిస్తూనే ఉంది శకుంతలమ్మ...కోడలు అయిన దానికీ, కానిదానికీ చిర్రుబుర్రులాడడం. భగవంతుడు నన్ను కూడా తీసుకుపోయినా బాగుండును. చెంపల నుండి కన్నీరు జాలువారింది.

అందరి సమక్షంలో కేక్ కట్ చేసింది దివ్య. అందరూ ఆనందంగా చప్పట్లు చరిచారు. ఒక్కొక్క ముక్క తీసి అందరికీ పంచిపెట్టింది వసంత. వచ్చిన పిల్లలందరూ రకరకాల ఫలహారాలు తిని సంతోషంగా ఇళ్లకెళ్లిపోయారు.

వంటింట్లో నుండి వస్తూనే దివ్య కోసం వెతికింది వసంత. కనిపించలేదు. అత్తగారి గదిలో నుండి మాటలు వినిపిస్తుంటే వెళ్లి గుమ్మం దగ్గర నిలబడింది.

"నానమ్మా! ఈ ఒక్కముక్క తిను. నా బుజ్జి కదూ. నా బంగారం కదూ. ఈ కేక్ తిన్నావంటే నువ్వు కూడా మమ్మీ డాడీల్లాగా బలంగా ఉంటావ్. నీ బుగ్గలు కూడా గుండ్రంగా మారిపోతాయి. నువ్వు కూడా నాకులాగానే చక్కగా, అందంగా ఉంటావ్. తిను నానమ్మా!" నానమ్మ పక్కనే కూర్చుని పసిపిల్లకు పెట్టినట్టు కేక్‌ను నోటికందిస్తోంది దివ్య.

శకుంతలమ్మ నవ్వుతూనే "ఫో.. నేను తినను గాక తినను. నువ్వు తినడానికి మీ అమ్మను సతాయించడం లేదా" చిన్న పిల్లలా మొరాయిస్తోంది శకుంతలమ్మ.

దివ్య మరింత మురిపెం చేస్తూ "నేనిక అల్లరి చేయకుండా తింటాను. స్కూల్‌కెళ్తాను. సరేనా నానమ్మా. నన్ను మా మమ్మీ అనుకో. నువ్వు నేననుకో. పెద్దవాళ్లు పసివాళ్లతో సమానమని నిన్ననే మా టీచర్ చెప్పింది. నువ్విప్పుడు చిన్న దివ్యవి. ఈ కాస్త ముక్క తినమ్మా. నా బొమ్మ కదూ. నా కొండ కదూ. తింటే నీకు బోలెడన్ని చీరలు కొనిపెడతా!" అని కేక్ ముక్కను నోటికందించింది.

శకుంతలమ్మ చిన్నపిల్లలా మెలికలు తిరిగిపోతూ దివ్యను ఒళ్లోకి లాక్కుంది. నానమ్మ బుగ్గ మీద దివ్య ముద్దు పెట్టింది. ఆమె కూడా దివ్యను ముద్దుపెట్టుకుంది. వారిద్దరి మధ్యా అనురాగం, ఆప్యాయతలే విరబూస్తున్నాయి.

ఇదంతా చూస్తున్న వసంత కళ్లు చెమ్మగిల్లాయి. అత్తగారి మీద చూపించిన విసుగు గుర్తుకొచ్చి గుండెల్లో కలుక్కుమంది. చెంగుతో కళ్లొత్తుకుని గదిలోకొచ్చింది. "దివ్య! నానమ్మను కొంచెం సేపు విశ్రాంతిగా పడుకోనీయమ్మా!" అని చెప్పి అత్తగారి వైపు తిరిగి "అత్తయ్యా! మీరు విశ్రాంతి తీసుకోండి. వేడి వేడి పాలల్లో కాస్తంత పసుపు, మిరియాలు కలుపుకొస్తాను. తాగి పడుకోండి. మధ్యాహ్నం రెండు గంటలకి భోజనానికి పిలుస్తాను. సరేనా!" పసిపాపను సముదాయించినట్లుగానే సముదాయించి వంటింట్లోకెళ్లిపోయింది వసంత.

కోడలి వంక నీరు నిండిన కళ్లతో చూసి... ముద్దుగా, మురిపెంగా దివ్యను గుండెలకు హత్తుకుంది శకుంతలమ్మ.

-డా.జి.జాన్ కెనడి (హైదరాబాద్)

## రచయిత్రి ఉత్తరం

కమలాకర్రావ్‌కి కలం స్నేహం అంటే మహా ఇష్టం.

అతనికిదో హాబీ అనేకంటే వ్యసనం అంటేనే